క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి చర్యలు



గుడివాడరూరల్: నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. పట్టణంలోని ఏలూరురోడ్డులోని టీడీపీ కార్యాలయంలో 1,36,15వార్డుల్లోని పలు సమస్యలను ప్రజలు శనివారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి శనివారం నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కేటాయించినట్లు తెలిపారు. పట్టణ పరిధిలో రోడ్ల అభివృద్ధికి రూ.10కోట్లను సీఎం చంద్రబాబు మంజూరు చేశారని, త్వరలోనే రోడ్ల పనులు ప్రారంభిస్తామన్నారు.

విష్ణాలయంలో గీతాపారాయణం



పామర్రు: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక విష్ణాలయంలో గీతాపారాయణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆలయంలో స్వామికి విశేషంగా అభిషేకాలను స్నపనలు, శత సహస్ర నామాలతో పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గీతా బాల భజన భక్త సమాజ సభ్యుల చేత గురువు రాజేశ్వరీ ఆధ్వర్యంలో భగవత్ గీతా పారాయణ, విష్ణు, లలిత సహస్ర నామ పారాయణ చేశారు.

నేడు రేణుకా పరమేశ్వరుడికి అన్నాభిషేకం

పామర్రు: స్థానిక అంకమ్మతల్లి ఆలయంలో మాఘ మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం రేణుకా పరమేశ్వరుడికి అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వరదా అప్పారావు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ శ్రీసూక్త నవగ్రహ పూజ, దేవీహోమం జరుగుతుందని పేర్కొన్నారు. రేణుకా పరమేశ్వరుడికి కె శ్రీనివాస్, శ్రీదేవి దంపతులచే అన్నాభిషేకం జరుగుతుందని తెలిపారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఫిర్యాదు

పామర్రు: పంచాయతీ పరిధిలో చెత్త నుంచి సంపద కేంద్రంలో కార్మికురాలుగా పనిచేస్తున్న తనపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేధింపులకు పాల్పడుతున్నాడంటూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం పారిశుద్ధ్య కార్మికురాలు ఫిర్యాదు చేశారు. ఈ వేధింపులతో పాటు మచిలీపట్నం రోడ్డులో తాను పల్లీలు అమ్ముకునేందుకు వేసుకున్న గుడారాన్ని కూడా తీసివేయాలని హెచ్చరికల నేపథ్యంలో ఆమె పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదును మేరకు ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్‌ను విచారణ చేపట్టాలని ఆదేశించినట్లు సీఐ సుభాకర్ తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ శనివారం తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం ఉచిత మందులను రోగులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా భావనారుషి, భద్రావతిదేవి విగ్రహ ప్రతిష్ఠ

గూడూరు: గూడూరు మండలం మల్లవోలులో నిర్మించిన భావనారుషి భద్రావతి దేవీ ఆలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ శనివారం ఘనంగా జరిగింది. శిరందాసు సత్యనారాయణ, ఆదిశేషమ్మల ఆధ్వర్యంలో పద్మశాలీల కులదైవమైన భావనారుషి-భద్రావతీదేవి ఆలయ నిర్మాణం చేపట్టారు. దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠతో పాటుగా లక్ష్మీ గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలను కూడా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వేద పండితులు అయిలూరి జై కిషోర్ ఆధ్వర్యంలో యాగశాలను ఏర్పాటు చేసి వేదమంత్రాల నడుమ దేవతామూర్తుల విగ్రహప్రతిష్ఠ కనుల పండువగా చేశారు అనంతరం స్వామి వార్ల కల్యాణం జరిపించారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన జరిగింది.

12న జలధీశ్వరాలయంలో అగస్త్య మహర్షి దంపతుల విగ్రహ ప్రతిష్ఠ

ఘంటసాల: ఏకపీఠంపై కొలువై ఉన్న శివ పార్వతులతో ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ఘంటసాల గ్రామంలోని బాలపార్వతీ సమేత శ్రీ జలధీశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 12వ తేదీ అగస్త్య మహర్షి – లోపాముద్ర దేవి దంపతుల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు దేవాలయాభివృద్ధి కమిటీ సభ్యుడు గొర్రెపాటి రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

సమస్యల ఏకరువు.. పరిష్కారం కరువు

- ఆర్భాటానికే పరిమితమైన రెవెన్యూ సదస్సులు
- సదస్సుల్లో ఇచ్చిన అర్జీలకు కలగని మోక్షం
- ఆందోళనలో బాధితులు



గుడివాడ మండలం శేరీదింటకుర్రులో అర్జీ స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

గుడివాడరూరల్: రెవెన్యూ సమస్యల పరిష్కారం పేరిట ఆర్భాటంగా కూటమి ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులు అర్జీల స్వీకరణకే పరిమితమయ్యాయి. ఆర్భాటమే తప్ప ఆచరణలో సమస్యలు పరిష్కారం కావడం లేదంటూ బాధితులు గగ్గోలు పెడుతున్నారు. నెలలు గడుస్తున్నా సమస్యల పరిష్కారం ఎక్కడవేసిన గొంగడి అక్కడి మాదిరిగానే ఉండటంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పైసలిచ్చిన వారి పనులే జరుగుతున్నాయని, పైసలివ్వనివారి అర్జీలనూ మూలన పడేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ సదస్సుల సమయంలో హడావుడి చేసిన ప్రజాప్రతినిధులు సభలు ముగిసిన తర్వాత సమస్యల వైపు కన్నెత్తి చూడటం లేదని అర్జీలు సమర్పించినవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రెవెన్యూపరమైన సమస్యల అర్జీలను స్వీకరించారు. ఇది కాక మీకోసం అంటూ ప్రతి వారం అధికారుల వద్ద ఫిర్యాదులు చేసుకోవచ్చని చెప్పారు. ప్రజలు అర్జీలు ఇచ్చారే తప్ప వాటికి పరిష్కారమే ప్రభుత్వం సూచించలేకపోతోంది. పేర్లు మార్చి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఫిర్యాదులు స్వీకరిస్తున్న కూటమి ప్రభుత్వం అనంతరం ఆ అర్జీలకు న్యాయం చేయలేకపోతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆన్‌లైన్ చేయకుండా వదిలేశారు

గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం గత ఏడాది అక్టోబర్‌లో గ్రామసభలు నిర్వహించింది. గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ చేయకుండానే వదిలేశారు. సమస్యలు పరిష్కరించలేదు. గ్రామ సభల్లో వచ్చిన అర్జీలు పరిష్కారం కాకుండానే కూటమి ప్రభుత్వం నెల తిరగకుండానే రెవెన్యూ సదస్సుల నిర్వహణకు డిసెంబర్‌లో తెరతీసింది. దీంతో అధికారులు అటు గ్రామ సభల్లోని సమస్యల అర్జీలను పరిష్కరించలేక మూలన పడేసి రెవెన్యూ సదస్సుల వైపు పరిగెత్తారు. ఊరూరా సదస్సులు పెట్టి కూటమి నాయకులతో హడావుడి చేసింది. గ్రామ సభల్లో ఇచ్చిన అర్జీలకు అతీగతి లేకపోయినా ఆ సభల్లో అర్జీలు ఇవ్వని వారు రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇచ్చారు. ఇక గ్రామ సభలు జరగని చోట జరిగిన రెవెన్యూ సదస్సుల్లో కూడా పెద్ద ఎత్తున అర్జీలు వచ్చాయి. గత ఏడాది డిసెంబర్ 6 నుంచి 2025 జనవరి 8వ తేదీ వరకు నిర్వహించిన సదస్సుల్లో జిల్లాలోని 508 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. 25,515 మంది ప్రజలు పాల్గొన్నారు. 4,825 అర్జీలు గ్రామ సభల్లో అధికారులకు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు 1,490 అర్జీలు మాత్రమే పరిష్కారమయ్యాయి. మిగతావన్నీ పెండింగ్‌లో పెట్టారు.

పైసలిస్తేనే పనులు?

ప్రజాప్రతినిధులు రెవెన్యూ సదస్సుల సమయంలో నానా హడావుడి చేసి కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సదస్సులు నిర్వహిస్తోందని ఊదరగొట్టారు. ఆచరణలో మాత్రం ఇదేమీ కన్పించడం లేదని అర్జీదారులు వాపోతున్నారు. అర్జీల రూపంలో కొందరు అధికారులు పైసలిస్తేనే పనులు అనే మాదిరిగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అర్జీలను పరిష్కరించే విషయంలో కూటమి ప్రభుత్వం మొద్దునిద్ర మాని రెవెన్యూ అర్జీలకు సంబంధించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అర్జీల్లో ఎక్కువగా కుల ధ్రువీకరణ పత్రాల మార్పులు, చేర్పులకు 291, 22ఎ తొలగింపునకు 243, గ్రీవెన్స్ ఆఫ్ రీసర్వే 432, అసైన్‌మెంట్ ఆఫ్ హౌస్‌సైట్స్ అర్జీలు వచ్చాయి. అదేవిధంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో రెవెన్యూ సమస్యలకు సంబంధించి 818, ఆర్‌వోఆర్‌లో సమస్యలకు సంబంధించి 1,758, ఇతర అంశాలకు సంబంధించి 1,050 అర్జీలు రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజలు అధికారులకు అందజేశారు. అధికారులు పరిష్కారంలో మాత్రం తీవ్ర జాప్యం చేస్తుండటంతో అర్జీదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బదిలీపై వెళ్లిన అధికారులు చార్జి అప్పగించాలి

మండవల్లి: బదిలీపై వెళ్లిన అధికారులు చార్జి అప్పగించాలని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్‌ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి అప్పారావు పేర్కొన్నారు. నాయకులు శనివారం విలేకరులతో మాట్లాడుతూ అధికారులకు నెలల తరబడి రికార్డులు అప్పగించకపోవడంతో సరైన సమాచారం లేక పాలన కుంటుపడుతోందన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి కొండలు బదిలీపై వెళ్లి నెలలు గడిచినా ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా నియమితుడైన సాయిప్రదీప్‌కు రికార్డులు అప్పగించలేదని గ్రామసభలో తెలియజేశాడన్నారు. బదిలీపై వెళ్లిన అధికారులు చార్జి అప్పగించి అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.

నేడు సరస్వతీ యాగం

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో సరస్వతీ యాగాన్ని ఆదివారం వేద పండితులు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శనివారం దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తెలిపారు. ఈ యాగాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడు శ్రీనాథ్‌కు గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన శ్రీనాథ్

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు నీలకంఠేశ్వరపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కె.ఎల్.శ్రీనాథ్ డిస్క్ త్రోలో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ విషయాన్ని ఆయన శనివారం విలేకరులకు తెలిపారు. 44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీలు రాజస్థాన్ అల్వార్‌లో ఈ నెల 6, 7, 8వ తేదీల్లో జరిగాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో (45+)హేమర్ త్రో, డిస్క్ త్రోలో గోల్డ్ మెడల్‌ను తాను సాధించానని తెలిపారు. షాట్ పుట్‌లో బ్రాంజ్ మెడల్, 400మీటర్ల రిలే విభాగంలో సిల్వర్ మెడల్ సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలతో ఉపాధ్యాయులు

నందివాడ: గ్రిగ్ మెమోరియల్ పోటీల్లో విజేతలకు నిలిచిన నందివాడ మండలం రుద్రపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ సుబ్బారావు, వ్యాయామం ఉపాధ్యాయుడు శివకుమార్, కార్యదర్శి నరసింహారావు, లలితకుమారి, అనురాధ పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధేంద్రుని గ్రామోత్సవం



గ్రామోత్సవంలో కూచిపూడి కళాకారులు

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలో శ్రీ సిద్ధేంద్ర యోగి మందిర వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. దేవదాయ, శాఖ నిర్వహణాధికారి ఎస్‌వీ సుబ్బారావు పర్యవేక్షణలో అర్చకులు చింత శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో అభిషేకం, అలంకారం అష్టోత్తర శతనామ సహస్ర పూజార్చనలను పురోహితులు మహంకాళి శివరామ్ నిర్వహించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార్ గ్రహీతలు వేదాంతం సత్య నృసింహ శాస్త్రి, పసుమర్తి మృత్యుంజయ శర్మ, పసుమర్తి హరినాథశాస్త్రి, పురోహితులు చింత సూర్య ప్రకాష్ రావు, నాట్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


రఘుపతి వెంకటరత్నం నాయుడుకు నివాళి



బందరులో వెంకటరత్నం నాయుడు విగ్రహానికి నివాళులు అర్పించిన దృశ్యం

మచిలీపట్నంటౌన్: సంఘ సంస్కర్త రఘుపతి వెంకటరత్నం నాయుడుకు అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) వ్యవస్థాపక అధ్యక్షుడు సమ్మెట ప్రసాద్ నివాళులు అర్పించారు. శనివారం మచిలీపట్నం విచ్చేసిన ఆయన జిల్లా కోర్టు రోడ్డులో ఉన్ రఘుపతి వెంకటరత్నం నాయుడు కాంస్య విగ్రహానికి తన మిత్ర బృందంతో కలసి పూలమాలలు వేశారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ కొంతమంది అక్రమ వలసదారులను ట్రంప్ ప్రభుత్వం పంపుతుందని భారతీయులు భయపడవలసిన అవసరం లేదన్నారు. మచిలీపట్నం వంటి పుణ్యభూమిలో వెంకటరత్నం విగ్రహం ఏర్పాటు చేసే అవకాశం ఆప్తాకు రావటం అదృష్టమన్నారు.
ఢిల్లీ ఆంధ్రా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, కాపు ఆర్గనైజేషన్ ఐకాన్ నిర్వాహకులు, రైల్వే శాఖ ఉన్నతాధికారి మెండు చక్రపాణి మాట్లాడుతూ కాపులంతా ఐక్యతగా ఉన్నారని, కాపులు కీలకం కానున్నారని తెలిపారు. ఐకాన్ మహా బలిజ యువత అభ్యున్నతికి విశేష కృషి చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ అంబటి లక్ష్మణ కుమారుడు డాక్టర్ పాపారావు మాట్లాడుతూ నేటి యువత దేశ ప్రగతికి కృషి చేయాలని, స్వార్థ చింతన వీడాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సోడిశెట్టి బాలాజీరావు, లంకిశెట్టి బాలాజీ, మండల దుర్గాప్రసాద్, మాదివాడ వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి సరస్వతీ గణపతి హోమం



సరస్వతీ గణపతి హోమంలో విజయక్రాంతి నిర్వాహకులు

చల్లపల్లి: విద్యార్థుల అభివృద్ధిని కాంక్షిస్తూ చల్లపల్లిలోని విజయ క్రాంతి కళాశాల ఆవరణలో శనివారం సరస్వతీ గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు శ్రీనివాస శర్మ ఆధ్వర్యాన జరిగిన హోమంలో కళాశాల కరెస్పాండెంట్ దుట్టా శివరామప్రసాద్, నాగలక్ష్మి దంపతులు, అవనిగడ్డలోని ఎస్‌వీఎల్ క్రాంతి కళాశాల కరెస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, వసుమతి దంపతులు పాల్గొన్నారు. రానున్నది పరీక్షా కాలం కావడంతో పిల్లలు పరీక్షలు బాగా రాయాలని, మంచి మార్కులు వచ్చేలా కటాక్షించాలని కోరుతూ హోమాన్ని నిర్వహించినట్లు కళాశాల కరెస్పాండెంట్ శివరామప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏ.పి.రాష్ట్ర అధ్యక్షుడు రాజులపాటి శివప్రసాద్, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సారా విక్రేతల అరెస్ట్



కోనేరుసెంటర్: బందరు మండలం తాళ్లపాలెం గ్రామంలో సారా విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 70 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో దాడులను నిర్వహించడంతో తాళ్లపాలెంలో సారా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేయగా గ్రామానికి చెందిన టి.రమణ, మరో వ్యక్తి సారా విక్రయిస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దాడిలో ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వరమ్మ, ఎస్సై జె.ఎలియాజర్, హెడ్ కానిస్టేబుల్ కె మధు పాల్గొన్నారు.

వెంకన్న భక్తులకు అన్నసమారాధన



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామిని దర్శించుకునేందుకు శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులు తమ తమ మొక్కులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్న సమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థికసాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా సామూహిక వ్రతాలు



గుడివాడ టౌన్: స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం సామూహిక వ్రతాలు ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో 600 మంది దంపతులు పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గుదే లక్ష్మీ రంగనాయకమ్మ, మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకట లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

బాలోత్సవాల్లో చింతపాడు విద్యార్థులు



మండవల్లి: హేలాపురి(ఏలూరు) బాలోత్సవాల్లో మండలానికి చెందిన చింతపాడు విద్యార్థులు శనివారం ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో రెండు రోజులు ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులకు, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు మానవత స్వచ్ఛంద సంస్థ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మానవత డైరెక్టర్లు దూలం వాసవి, కనకదుర్గ, సత్యప్రభ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

శ్రీమన్నారాయణుడికి ప్రత్యేక అభిషేకాలు



శ్రీమన్నారాయణుడు

కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం భక్తులతో పోటెత్తింది. భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని గ్రామంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు తిరుమంజన సేవ జరిగింది. అనంతరం ప్రత్యేక పల్లకీలో స్వామివార్లను ఆలయ మాడవీధుల వెంట ఊరేగించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 10మంది పండితులు మంత్రోచ్చరణల నడుమ 108 కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాటిని ఆలయం చుట్టూ ఊరేగించి గర్భాలయంలోని 11 అడుగుల శ్రీమన్నారాయణుడి విగ్రహానికి అభిషేకాలు చేశారు. రాష్ట్ర గోదా విష్ణుసహస్రనామ పరివార్ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివారి పారాయణ ఏకాహాన్ని ప్రారంభించారు. అష్టభుజ మండలంలో స్వామి చిత్రపటాన్ని నెలకొల్పి తులసీ దళాలతో మహిళలు పూజలు చేశారు. రాత్రి నగరోత్సవాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం 10గంటల వరకు ఏకాహం కొనసాగుతుందని అష్టాక్షరీ స్వామిజీ చెప్పారు.

అక్రమ కట్టడాలను పట్టించుకోని అధికారులు



పంచాయతీ పోరంబోకు స్థలంలో అక్రమకట్టడం

పామర్రు: పామర్రు పంచాయతీ స్థలంలో అక్రమ కట్టడాల నిర్మాణ పనులు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎంతో విలువైన గ్రామ పంచాయతీ పోరంబోకు స్థలం, గఫార్ సెంటర్‌లో ఓ వ్యాపారి అక్రమ కట్టడాలకు తెరలేపారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక కార్యదర్శి రాజకీయ నాయకుడిగా వ్యవహరిస్తూ అక్రమ కట్టడం నిర్మించే వారికి సహకరిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పంచాయతీ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తాం

కైకలూరు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలని శీతనపల్లి, కొల్లేటికోట పీహెచ్‌సీల డాక్టర్లు కె.అన్నపూర్ణ, ఎల్.కిరణ్‌కుమార్ శనివారం కోరారు. కైకలూరులో డాక్టర్లు మాట్లాడుతూ సోమవారం రెండు పీహెచ్‌సీల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కిషోర బాలికలు ఇలా మొత్తం 14,750 మంది విద్యార్థులను గుర్తించామన్నారు. వీరందరికీ మధ్యాహ్నం భోజనం పూర్తయిన తర్వాత ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తామన్నారు. మిగిలిన వారికి ఈ నెల 17న పంపిణీ చేస్తామని తెలిపారు. నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి అందరూ సహకరించాలని డాక్టర్లు కోరారు.

ఇళ్లకు తరలుతున్న వరిగడ్డి




తోట్లవల్లూరులో ఎడ్లబళ్లపై వరిగడ్డిని ఇళ్లకు తరలిస్తున్న రైతులు

తోట్లవల్లూరు: వరిగడ్డి ఇళ్లకు చేరుతోంది. మండల వ్యాప్తంగా రైతులు గత ఖరీఫ్ సీజన్లో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. గత ఏడాది నవంబర్‌లో వరికోత యంత్రాలతో కొంత మంది రైతులు ధాన్యం నూర్పిడి చేశారు. అధిక శాతం రైతులు గత కొన్ని రోజులుగా ధాన్యం నూర్పిడి పనులు నిర్వహిస్తున్నారు. ధాన్యం నూర్పిడి పూర్తి కావటం, ఎండల తీవ్రత కూడా పెరుగుతుండటంతో వరిగడ్డిని ఇళ్లకు తరలించే పనులను రైతులు చేపట్టారు. ఎడ్లబళ్లు, ట్రాక్టర్ల ద్వారా వరిగడ్డిని ఇళ్లకు తరలించి పశుగ్రాసం కోసం నిలువ చేస్తున్నారు.

వెలుగులీనుతున్న సత్యదేవుని సన్నిధి



సత్యదేవుని విద్యుద్దీపాల భారీ కటౌట్



సీతారాముల విద్యుద్దీపాల కటౌట్

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామివారి సన్నిధిలో సత్యదేవుని ఆకృతితో విద్యుద్దీపాల భారీ కటౌన్ భక్తులను ఆకట్టుకుంటోంది. అలాగే దేవస్థాన సన్నిధి అంతా రంగు రంగుల విద్యుద్దీపాలు, వివిధ దేవుళ్ల ఆకృతిలో భక్తుల్ని అలరిస్తున్నాయి.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

గుడ్లవల్లేరు: శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి స్వామి సన్నిధిలో గుడివాడ నటరాజ కళా మండలి వారు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కూచిపూడి నాట్యంతో పాటు వివిధ దేవతా మూర్తులకు సంబంధించిన నృత్యాలను కళాకారులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.



ఆకట్టుకున్న వెంకటేశ్వర, అలివేలు మంగ, పద్మావతీ దేవీల నాట్య ప్రదర్శన